

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39 (ఆదివారం)
కనిష్ఠం : 28

మద్యానికి డబ్బులివ్వలేదని.. స్నేహితుల చేతుల్లో యువకుడి హత్య 7

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రాష్ట్రవ్యాప్తంగా చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యులు 7
- అమలాపురంలో మూడు చోరీ కేసుల్లో వీరు నిందితులు
- రూ.40లక్షల విలువైన వెండి, బండారు ఆభరణాలు స్వాధీనం

ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్ 7

నేడే తుని చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక 7

ఘనంగా సర్వపృష్ఠాప్తోర్యామ యాగం ప్రారంభం 7

జీజీహెచ్‌లో రాష్ట్రస్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ

- కాకినాడ ఆర్‌ఎంసీ, రాజమహేంద్రవరం జీఎస్ఎల్, అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలల నుంచి 100మంది జనరల్ సర్జరీ పీజీ వైద్య విద్యార్థుల హాజరు 7

టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి

మెయిన్‌లో..

- పంట కోస్తుండగా కత్తులతో తెగబడిన వైసీపీ కార్యకర్తలు
- పొలం వివాదమే కారణం
- పెద్దాపురంలో ఘటన
- నకిలీ పత్రాలు సృష్టించి భూమి కొట్టేసేందుకు స్కెచ్?

వేట నిషేధ పరిహారం పెంపుపై మత్స్యకారుల హర్షం

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు వేట నిషేధ సమయంలో చెల్లించే పరిహారం రూ.10వేలనుంచి రూ.20 వేలకు పెంచి వారిఖాతాల్లో జమచేయడం పట్ల స్థానిక ఏటిమొగ రోడ్డులో ఆదివారం కాకినాడ బోట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంవద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీప్రకారం కూటమి ప్రభుత్వం వేట నిషేధ పరిహారాన్ని రెట్టింపు చేసిందన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వమే మత్స్యకార భృతిని ప్రవేశపెట్టి వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలను ఆదుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కొండబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బోట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, ఉపాధ్యక్షుడు మల్లాడి రాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, పినపోతు తాతారావు, కాటాడి రామకృష్ణ, పాలెపు శేఖర్, చింతా పేర్రాజు, నాటి బాబులు, సంగాడి చిరంజీవి, కొల్లు బుజ్జి, వనమాడి కోయరాజు, చోడిపల్లి సతీష్, మూగు రాజు పాల్గొన్నారు.



లే..ఔట్!

నివాసయోగ్యం కాని స్థలాలు రద్దు?

2019 ఎన్నికల ముందు అందరికీ ఇళ్లిస్తామంటే పేదలు నమ్మారు.. ఓటేశారు.. గెలిపించారు.. తీరా చూస్తే.. కొండలు.. గుట్టలు.. చివరికి శ్మశానాలు.. అదీ ఇదీ అని ఏముంది.. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ స్థలాలు ఇచ్చేశారు.. మా పనైందని గత పాలకులు చేతులు దులుపుకున్నారు.. తీరా చూస్తే చాలా లేఅవుట్లలో ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకపోవడానికి కారణమేంటనే దానిపై దృష్టిసారించింది.. అనువుగా లేకపోతే రద్దు చేసే యోచనలో ఉంది.. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో 59 లేఅవుట్లు రద్దు చేసినట్టు సమాచారం.

తూర్పుగోదావరి	
లేఅవుట్లు	526
మంజూరు	73,282
పూర్తయినవి	27,971
వివిధ దశల్లో	18,807
ప్రారంభంకానివి	26,504
వ్యయం	601.65 కోట్లు

కాకినాడ	
లేఅవుట్లు	698
మంజూరు	87,648
పూర్తయినవి	29,009
వివిధ దశల్లో	29,020
ప్రారంభంకానివి	29,619
వ్యయం	681.4 కోట్లు

కోనసీమ	
లేఅవుట్లు	702
మంజూరు	43,561
పూర్తయినవి	15,330
వివిధ దశల్లో	14,921
ప్రారంభంకానివి	13,310
వ్యయం	385.31 కోట్లు

- పేదింటి కల తీర్చేలా అడుగులు
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- లేఅవుట్లపై సర్కారుకు నివేదిక
- తూర్పున 59 లేఅవుట్లు రద్దు
- కాకినాడ, కోనసీమలో పరిశీలన
- కోట్లు ఖర్చు చేసి ఖాళీగా..
- పేదలను మోసగించిన జగన్
- కొత్త స్థలాల ఎంపిక యోచన
- పల్లకడియంలో 598 ఎకరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
గత ప్రభుత్వం పేదలందరినీ మోసం చేసింది.. ఎంతో ఆశగా ఇళ్ల స్థలాలకు ఎదురుచూసిన పేదలకు నిరాశనే మిగిల్చింది.. ఇళ్ల స్థలాలకు పనికిరాని భూములను ఎంపిక చేసి పేదింటి ఆశను నీరుగార్చింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లిస్తామని చెప్పి నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో హడావిడిగా భూమి సేకరించి.. లేఅవుట్లు సిద్ధం చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 526 ప్రాంతాల్లో హడావిడిగా లేఅవుట్లు వేస్తున్నట్టు ప్రకటించి కనీసం చాలా చోట్ల లేఅవుట్లు వేయలేదు.కొన్ని చోట్ల కాగితాలపై లేఅవుట్లు చూపించారు. జిల్లా వ్యాప్తంగా 73,282 మంది లబ్ధిదారులకు సెంటు,సెంటున్నర స్థలం వంతున పట్టాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.కేవలం భూమిని మాత్రమే సేకరించి లేఅవుట్‌వేశారు.మౌలిక వసతులు మాటేమరిచారు. దీంతో 26,504 మంది అసలు ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదు. ఆ లేఅవుట్లు రద్దు చేయనున్నారు.

అర్బన్‌కు కేరాఫ్ పల్లకడియం

ఇక అర్బన్ ప్రాంతాల లబ్ధిదారులకు ఎంపిక చేసిన లేఅవుట్లు సరిగ్గాలేవు. బూరుగు పూడి, కాపవరం ఆవ ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రతిపాదన వివాదాస్పదనమైన సంగతి తెలి సిందే. దీనిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే వెలుగుబంద కాలనీలోని ఇళ్లను పూర్తి చేస్తుంది.రాజానగరం మండలం పల్లకడియం, కానవరం ప్రాంతాల్లో 12 లేఅ వుట్లకు 598.72 ఎకరాలు సేకరించారు. ఇక్కడ 22,898 మందికి ఇళ్ల నిర్మాణం చేయనున్నారు.గత ప్రభుత్వం సెంటు వంతున స్థలంతో పట్టాలు ఇచ్చి వదిలేసింది.ప్రస్తుత ప్రభుత్వం ఈ స్థలాల్లోనే రెండేసి సెంట్ల వంతున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించడంతో పాటు, మిగిలిన వారికి టిడ్కో ఇళ్లు నిర్మించే యోచనలో ఉంది. బూరుగుపూడి, కాపవరం ప్రాంతాలు ఆవ ప్రాంతంలోని 11,954 మంది ఎక్కడ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది.వీరంతా రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులే కావడం గమనార్హం.

కోనసీమ జిల్లాలో ఇలా..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నివాసయోగ్యం కాని స్థలాల్లో లేఅవుట్లను రద్దుచేసి అర్హులకు ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం లేఅవుట్లు 702.. ఇళ్ల లబ్ధిదారులే 43,561 ఉండగా వివిధ దశల్లో ఉన్నవి 14,921,పూర్తయినవి 15,330, ప్రారంభంకానివి 13,310 ఉన్నాయి.. మొత్తం వ్యయం 385.31 కోట్లు వ్యయం చేశారు. ఇంత వరకూ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని పట్టాదారుల ఆచూకీపై అధికారులు ఆరా తీసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం.

కాకినాడ జిల్లాలో ఇలా..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)
గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలు లబ్ధిదారుల అనాసక్తితో వెలవెలబోతున్నాయి. కాకినాడ జిల్లా పరిధిలో 698 లేఅవుట్లు వేశారు. 87,648 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 29009 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. వివిధ దశల్లో 29020 ఇళ్లు ఉన్నాయి. 29619 ఇళ్లు అయితే ప్రారంభమేకాలేదు.ఈ లేఅవుట్లకు 681.4 కోట్లు వ్యయం చేశారు.నివాస ప్రాంతాలకు దూరంగా ఉండడం,పల్లపు ప్రాంతాలు కావడం,పొలాల మధ్య ఉండడం,సముద్రపు ప్రాంతాల్లో ఇవ్వడం వంటి పరిస్థితుల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు.

చంద్రన్న అడుగులు

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ఘన విజయం సాధించి సీఎం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆలోచన చేస్తున్నారు.అసలైన లబ్ధిదారులు ఎంత మంది? ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారెందరు? ఆయా ఇళ్లల్లో ఉంటున్న వారెందరో తెలుసుకునే చర్యలు చేపట్టింది. దీంతో అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేసింది. ఇప్పటి వరకు కనీసం ఒక ఇటుక కూడా వేయకుండా ఖాళీగా ఉంచిన స్థలాల లెక్క తేల్చింది. ఆ పట్టాలను రద్దు చేసి,అర్హులైన నిరుపేదలకు కొత్తగా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది.గత ప్రభుత్వంలా కాకుండా లబ్ధిదారులకు రెండు సెంట్ల భూమి ఇచ్చే ఆలోచన చేస్తోంది.

తూర్పున రద్దు లేఅవుట్లు ఇవే

నివాస యోగ్యంకాని 59 లేఅవుట్లు ఇలా ఉన్నాయి.కడియం మండలం వేమగిరి-3 (జడ్పీ స్థలం).కోరుకొండ మండలం నర్సాపురం- కనపూరు రోడ్డు,జగన్నాథపురం-1,రంగంపేట మండలం వడిశలేరు లేఅవుట్-2, చంద్రేడు లేఅవుట్ -1,ముకుందవరం-2,ఈలకొలను, ఈలకొలను-2, నల్లమిల్లి లేఅవుట్ -1, వీరంపాలెం-1, దేవరపల్లి మండలం జగన్నాథపురం రోడ్డులో లేఅవుట్,బుచ్చియ్యపాలెం, కొండగూడెం హౌసింగ్ బోర్డు,గౌరీపట్నం రజకుల చెరువు, యర్నగూడెం పోలేరమ్మ టెంపుల్ లేఅవుట్, కృష్ణపాలెం,ధుమంతునిగూడెం,పల్లంట,కురు కూరు, రాతిగుంటచెరువు లేఅవుట్లు ఉన్నాయి. గోపాలపురం మండలం నందిగూడెం-1, భీమోలు -1 ,వడలకుంట-2,గోపాలపురం- 2,3,4,5, వేళ్లచింతలగూడెం-1,కరగపాడు-2, నల్లజర్ల మం డలం నబీపేట-2, నల్లజర్ల -4, జగన్నా థపు రం-2, అచ్చన్నపాలెం, సింగరాజుపాలెం-1,2,3 లేఅవుట్లు.నిడదవోలు మండలం తాడిమళ్ల -2, శెట్టిపేట టిడ్కో,ఎస్సీ పేట రామాలయం దగ్గర లేఅవుట్.పెరవలి మండలం ఎలిమెంటరీ స్కూల్ దగ్గర లేఅవుట్, అసైన్డ్‌లాండ్ లేఅవుట్, పాల ఆది నారాయణ షెడ్ దగ్గర లేఅవుట్, రవళి స్పిన్నింగ్ మిల్లు వెనుక,ఎస్సీ పుంత, పిరమిడ్ జ్ఞాన మందిర లేఅవుట్, ఉండ్రాజవ రం మండలం అజ్జరం కాలనీ లేఅవుట్లు ఉన్నాయి.

ఉగ్ర ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



ఉగ్రదాడికి నిరసనగా పిఠాపురంలోని ఏబీసీ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ

పిఠాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిఠాపురంలోని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మరణించిన పర్యాటలకు నివాళులర్పించారు. వారి ఆత్మశాంతి కలగాలని ప్రార్థనలు నిర్వహించారు. ఏబీసీ చర్చి అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు, పాస్టర్ థిమోథిలాస్ పాల్గొన్నారు.

సూర్యారావుపేట సముద్రతీరంలో సందర్శకుల కోలాహలం



కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట సముద్ర తీరంలో చిన్నారులు, విద్యార్థుల సందడి

సర్పవరంజంక్షన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్ ఆదివారం సందర్శకులతో కిక్కిరిసింది. విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడం, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వేసవి తాపం నుంచి సేదతీరేందుకు సాయం సమయాన బీచ్‌ను సందర్శించేందుకు జిల్లానలుమూలలనుంచి వేలాదిమంది కుటుంబసభ్యులు, పిల్లలతో కలిసి తరలివచ్చారు. దీంతో సూర్యారావుపేట బీచ్ జనసందోహంతో నిండిపోయింది. సముద్రతీరంలో చిన్నారులు ఆటపాటలు, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. యువతీ,యువకులు సముద్రస్నానాలుచేస్తూ కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. యువకులు సముద్రతీరంలో బైక్ విన్యాసాలతో చేయగా, సముద్రంలో వాలీబాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. బీచ్‌కు సందర్శకుల రద్దీతో కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది తీరంలో గస్తీ నిర్వహించారు.లైట్‌హౌస్‌నుంచి నేమాం వరకు ట్రాఫిక్ జామ్‌కావడంతో తిమ్మాపురం పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు.

4న నీట్ పరీక్షలు: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మెడికల్‌కళాశాలలో ప్రవేశానికి మే 4న నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మే 4న నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఉత్తర్వులను జారీచేశారు. 4న మధ్యాహ్నం 2గంటలనుంచి 5గంటల వరకు నీట్ పరీక్ష కాకినాడలో 10పరీక్ష కేంద్రాల్లో ఓఎంఆర్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2880మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. అన్నికేంద్రాలకు కాంపౌండ్ వాల్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలతో నిశిత పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలదృష్ట్యా పరీక్ష కేంద్రాలన్నింటిలో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

బరితెగించారు!



గొల్లప్రోలు మండలం చెందుర్తి పరిధిలో పుష్కర కాలువ గట్లను తవ్వేసిన దృశ్యం



గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులో అనుమతులేకుండా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు

- పోలవరం, పుష్కర గట్లు కొల్లగొడుతున్నారు
- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- రాత్రివేళ ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలింపు
- రెవెన్యూ, పోలీసు సిబ్బందికి బెదిరింపులు
- పట్టించుకోని పోలవరం, మైన్స్ అధికారులు

(ఆంధ్రజ్యోతి,పిఠాపురం/గొల్లప్రోలు రూరల్):
గ్రావెల్ మాఫియా బరితెగించింది. పోలవరం, పుష్కర కాలువ గట్లను కొల్లగొట్టేస్తున్నారు. రాత్రివేళ ట్రాక్టర్లు, లారీల ద్వారా గ్రావెల్, మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. కొందరి నేతల అండతో అక్రమతవ్వకాలను అడ్డుకోబోయిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని బెదిరించే స్థాయికి చేరుకున్నారు. ఆరునెలలుగా రహస్యంగా సాగిన ఈ దందాను ఇప్పుడు బహిరంగంగా సాగిస్తున్నారు. కోట్లాది రూపాయిలు విలువ చేసే గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా అటు పోలవరం, పుష్కర అధికారులు, ఇటు మైన్స్ శాఖ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాలో పోలవరం, పుష్కర కాలువల వెంబడి వేసిన గట్లు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఏ అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ ట్రాక్టరు, లారీల ద్వారా తరలిస్తున్నారు. అప్పుడప్పుడు పోలీసుశాఖ కేసులు నమోదు చేసినా, రెవెన్యూ అధికారులు పట్టుకుని నామమాత్రపు కేసులతో జరిమానా విధించినా తవ్వకాలు ఆగకపోగా మరింత పెరిగాయి. తవ్వకాలు, గ్రావెల్ తరలింపును అడ్డుకోవడానికి వచ్చే రెవెన్యూ, పోలీసు సిబ్బందిని బెదిరించడంతో వారు అక్కడికి వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రావెల్ మాఫియా ఇంతగా బరితెగించినా జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టిసారించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. గ్రావెల్ మాఫియాకి కొంత మంది కీలక నాయకుల అండదండలు ఉండడంతో వీరు అంతగా రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు కొండలు, గుట్టలు, చెరువులను వదలడం లేదు.

రాత్రయితే చాలు

గొల్లప్రోలు మండలం చెందుర్తి, కొడవలి, కేపెచ్‌పేట, దుర్గాడ తదితర గ్రామాల మీదుగా పోలవరం, పుష్కర కాలువలు వెళ్తున్నాయి. శంఖవరం, ప్రత్తిపాడు, తొండంగి మండలాల పరిధిలోనూ ఈ కాలువలు ఉన్నాయి. ఈ కాలువల వెంబడి గ్రావెల్, మట్టితో కూడిన భారీ గట్లు వేశారు. గత వైసీపీ ఐదేళ్ల వైసీపీ పాలనలో గట్లనుంచి గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తవ్వకాలు ఎక్కడా ఆగలేదు. గ్రావెల్ తరలింపుతో లక్షలాది రూపాయిల ఆదాయం వస్తుండడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగించే వారు మాఫియాగా ఏర్పడి మరింత బరితెగించారు. పగటిపూట ఎటువంటి అలజడి లేకుండా చీకటి పడగానే ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు ప్రారంభించి ట్రాక్టర్లు, లారీల ద్వారా గ్రావెల్, మట్టిని తరలించేస్తున్నారు. అక్కడ లైట్లు ఏర్పాటుచేసి మరీ తవ్వకాలు సాగిస్తున్నారు. తెల్లవారేసమయానికి అక్కడినుంచి జేసీబీలు, ట్రాక్టర్లు, లారీలు తరలించేస్తున్నారు. తాటిపర్తి, దుర్గాడలోని చెరువుల్లోను, చెందుర్తి, కొడవలి, దుర్గాడ-రావికంపాడు మార్గంలో ఉన్న కొండలు, గుట్టల్లోని గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు.

వీఆర్వోను బెదిరించి..

గ్రావెల్ అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు వెళ్లే రెవెన్యూ, పోలీసు అధికారులపై గ్రావెల్ మాఫియాలోని ముఖ్యులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఏదైనా చేస్తే ఎవరికి తెలిసే అవకాశం ఉండదనివారు బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో రాత్రివేళల్లో తవ్వకాలు అడ్డుకునేందుకు వెళ్లడానికి పోలీసు, రెవెన్యూ సిబ్బంది ముందుకు రావడం లేదని చెబుతున్నారు. వారం క్రితం ఇదే రీతిలో ఒక వీఆర్వోను బెదిరించి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను అక్కడినుంచి తీసుకుపోయిన సంఘటన చోటుచేసుకుంది. గ్రావెల్ మాఫియా బెదిరింపులకు పాల్పడుతున్నా ఉన్నతాధికారులు ఎవ్వరు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

అసలు వ్యక్తులపై కేసులేవీ

పోలవరం, పుష్కర కాలువ గట్లు వెంబడి ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే గ్రావెల్, మట్టిన అక్రమంగా తరలించుకుపోతున్నా పోలవరం, పుష్కర ఇరిగేషన్, మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ తవ్వకాలు వారికి తెలిసే జరుగుతున్నాయని చెబుతున్నారు. గతంలో పోలీసులు కేసులు నమోదు చేసినా, రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నా నామమాత్రపు జరిమానాలు విధించి వదిలిపెడుతుండడంతో అక్రమ గ్రావెల్ తవ్వకాలు ఆగకపోగా మరింత పెరుగుతున్నాయి. ట్రాక్టర్ పట్టుబడితే నామమాత్రంగా రూ.2వేల నుంచి రూ.8వేలు, లారీకి రూ.4వేలనుంచి రూ.10వేల జరిమానా విధించి వదిలివేస్తున్నారు. ఇప్పటివరకూ తవ్వకాలు సాగిస్తున్న ఎక్స్‌కవేటర్‌లను పట్టుకోకపోవడం గమనార్హం. ట్రాక్టర్లు, లారీలను మాత్రమే పట్టుకున్నట్లు చూపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న గ్రావెల్, మట్టిని తరలించినప్పుడు బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి. నామమాత్రపు కేసులే నమోదు చేసి ట్రాక్టర్లు, లారీలు, జేసీబీల డ్రైవర్లు, యజమానులు, తవ్వకాలు పాల్పడుతున్న అసలు వ్యక్తులపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొంతమంది నేతల ఒత్తిడితోనే అధికారులు నామమాత్రంగా జరిమానా విధించి వదిలిపెడుతున్నారనే విమర్శఉంది. క్రిమినల్ కేసులు నమోదు చేసి తవ్వకాలకు, రవాణాకు పాల్పడిన వారిని అరెస్టు చేస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని పలువురు సూచిస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు

- భక్తులను ఢీకొనడంతో ఒకరు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పుల్లలపాడు హైవే వద్ద ఘటన


మరణించిన అంజి(ఫైల్)

నల్లజర్ల ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవదర్శనం కోసం కాలినడకన వెళ్తున్న భక్తులను లారీ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరపల్లికి చెందిన బిరదా అంజి (25) మృతి చెందాడు. వివరాల ప్రకారం... దేవరపల్లికి చెందిన బిరదా అంజి, దాసు దుర్గాప్రసాద్, జాజు మొగ్గల సాయితేజ శనివారం రాత్రి దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవ దర్శనం కోసం కాలినడకన బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడు హైవే వద్ద వచ్చేసరికి వైజాగ్ నుంచి బళ్లారికి ఇసుప ఊసలు తీసుకెళ్తున్న లారీ వెనుక నుంచి వారిని ఢీకొంది. అంజి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం కాగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అంజిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిని దింపేందుకు వస్తూ..

టిప్పర్ ఢీకొని నలుగురు యువకులకు తీవ్ర గాయాలు

ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన యువకులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న నలుగురు యువకులను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారిపేటకు చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారి పేటకు చెందిన బి.వినోద్ స్నేహితులు. వారు ఆదివారం కాకినాడ, అక్కడి నుంచి యానాం వెళ్లి ఒకే మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావును ఇంటి వద్ద దింపేందుకు వారు వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. గాయపడినవారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్సులో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యానికి డబ్బులివ్వలేదని.. స్నేహితుల చేతుల్లో యువకుడి హత్య


గౌతమ్ (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): మద్యానికి డబ్బులివ్వలేదని నలుగురు కలిసి ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నివశిస్తున్న మీసాల గౌతమ్ (27)కు తండ్రి రమేష్, తల్లి జ్యోతి, సోదరి గాయిత్రి ఉన్నారు. కాగా గౌతమ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటాడు. అతడు స్థానిక రేచర్లపేటలోని గుర్రాల వారి వీధిలో ఉంటున్న ఓ యువతిని ప్రేమించాడు. ఈ విషయాన్ని గౌత మ్ తన తల్లిదండ్రులకు చెప్పగా కులాంతర వివాహం కావడంతో వారు పెళ్లికి ససేమిరా ఒప్పుకోలేదు. దాంతో గౌతమ్ ఇంటి వద్ద నుంచి వచ్చేసి గత కొన్ని రోజులుగా ఆ యువతి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో గౌతమ్‌కి స్నేహితులైన నలుగురు యువకులు ఆదివారం ఉదయం తాను ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో క్షణికావేశంలో ఉన్న ఆ నలుగురు పక్కనే ఉన్న కాంక్రీట్ సిమెంట్ రాయితో గౌతమ్ తలపై, ముఖంపై విచక్షణా రహితంగా మోది అక్కడ నుంచి పరారయ్యారు. తీవ్ర రక్త స్రావంతో రక్తపు మడుగులో పడి ఉన్న గౌతమ్‌ను స్థానిక అంబులెన్స్‌లలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేవీఎస్ హాకీ పోటీల విజేత 'కాకినాడ'


కాకినాడ జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో కేవీఎస్ హైదరాబాద్ రీజనల్ స్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని వెంకటగిరి, కరీంనగర్, కాకినాడ కేంద్రీయ విద్యాలయాల నుంచి 45 మంది బాలురు, విజయవాడ, రాజంపల్లి కేంద్రీయ విద్యాలయాల నుంచి 24మంది బాలికలు హాజరయ్యారు. క్రీడా ఉత్సవానికి శ్రీకారం చుట్టిన కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బొంత శేఖర్, జిల్లా స్థాయి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షుడు విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అర్థం చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన పోటీ భావనతో ఆటల్లో పాల్గొన్నాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రతిభను వెలిబుచ్చాలని ఆకాంక్షించారు. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయ మొదటి స్థానం, వెంకటగిరి కేంద్రీయ విద్యాలయం రెండోస్థానం, కరీంనగర్ మూడోస్థానం సాధించాయి. బాలికల విభాగంలో రాజంపల్లి మొదటి, విజయవాడ రెండోస్థానంలో నిలిచాయి. మొదటిస్థానంలో నిలిచిన కాకినాడ, రాజంపల్లి జట్లు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు కేవిఎస్ తరఫున అబ్జర్వర్‌గా కేంద్రీయ విద్యాలయ ఓఎన్‌జీసీ నుంచి కె.మధుసూధనరావు హాజరయ్యారు.

ఆర్ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు


డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అట్లూరి విష్ణువర్ధన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం పూర్తిస్థాయి డీఎంఈగా విజయవాడకు బదిలీ అయ్యారు. 1982 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ విష్ణువర్ధన్ సిద్దార్థ వైద్య కళాశాలలో చదివారు. అనంతరం ఆయన 1991లో మణిపాల్ కస్తూర్బా మెడికల్ కాలేజీలో అనస్థీషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తదుపరి 1997లో ఆర్ఎంసీలో అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన ఆయన 2006లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2015లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది అక్కడే విధులు నిర్వర్తించారు. అనంతరం 2023 ఫిబ్రవరి నుంచి అనస్థీషియా హెచ్‌వోడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2022 ఆగస్టు నుంచి ఆయన ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ఆయన హయాంలో ఆర్థో, ఈఎన్‌టి, న్యూరో సర్జరీ ఎమర్జెన్సీకి రెండు ఆపరేషన్ థియేటర్లు ప్రారంభించారు. డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో గడిచిన సంవత్సరకాలంలో 14 వేల మేజర్ సర్జరీలు నిర్వహించారు. అలాగే కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో రూ.1.25 కోట్ల నిధులతో మౌళిక సదుపాయాలను అనస్థీషియా విభాగానికి స మకూర్చారు. 5 అనస్థీషియా మెషిన్‌లు, 3 వెం టీలేటర్‌లు, ఒక ఇంక్యుబేటింగ్ బ్రాంకోస్కోప్, ఒక అల్ట్రా సౌండ్ మెషిన్ సమకూర్చారు. ఈ ఏడాది కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో ట్రామాకేర్ యూనిట్‌కు రూ.55 లక్షల నిధులతో 3 వెం టీలేటర్‌లు, 8 ఐసీయూ పడకలు, మరో 8 మ ల్టీ పేరా మానిటర్స్ సమకూర్చారు. ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులను అందుకున్నారు.

ముగ్గురు దొంగలు..17 కేసులు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం
- కోనసీమ జిల్లా ఎస్పీ వెల్లడి



అమలాపురంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాలవారివీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ అంతర్‌రాష్ట్ర ముగ్గురు సభ్యుల ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ వివరాలను అమలాపురం ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. జనవరి 11న అమలాపురంలోని కురసాలవారివీధిలో గల ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తలుపు బోల్టు తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు (33), అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు (35)లు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడక 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేదించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్‌ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్‌ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి వారిని అభినందించారు.

రాష్ట్రంలో మంచి పాలన

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
గంగాలమ్మతల్లి జాతరలో ప్రత్యేక పూజలు


జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి రవీంద్ర

నల్లజర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయానికి వెళితే ఎక్కడా పవిత్రత అనేది కనిపించలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో మంచి పాలన కొనసాగిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో గంగాలమ్మ తల్లి జాతరకు ఆయనతో పాటు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి పీతల సుజాత, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ అధ్య క్షురాలు ఆచంట సునీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకతీతంగా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈరోజు అదే ఆలయానికి వెళితే మనస్సుకు ప్రశాంతత కలిగిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుల, మతాల మధ్య చిచ్చుపెట్టొద్దన్నారు. అందుకు భగవంతుడు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాడన్నారు. అందుకే 164 సీట్లను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.259 కోట్ల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఘంటవారిగూడెంలో 100ఏళ్ల తరువాత జాతర జరగడం ఆనందదాయకమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్య నారాయణ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, కూచిపూడి ఉదయ భాస్కర్,నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి తదితరులున్నారు.

నేడు తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాల్టీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుంది. ఈ రెండు పదవులకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక లాంఛనమే. 30 మంది సభ్యులుగా గల తుని మున్సిపాల్టీలో టీడీపీకి 17 మంది సభ్యులు బలం ఉంది. దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక అవకాశం ఉంది. ఇప్పటికే చైర్మన్, వైస్ ఎన్నికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం చేశామని కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్యే యనమల దివ్యకు సమాచారం అందించామన్నారు. ఉదయం 11గంటలకు ఎన్నికల అధికారి, డీపీవో వి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరుగుతుందన్నారు. ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసుల ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. కేవలం ఓటింగ్‌లోనే పాల్గొనే సభ్యులు, గుర్తింపుకార్డు పొందిన పాత్రికేయులకు మాత్రమే అనుమతిఉంటుందని తెలిపారు.

తొండవరంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం


యాగం నిర్వహిసున్న పండితులు

అంబాజీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం గ్రామంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం ఆదివారం అమవాస్యనాడు ఘనంగా ప్రారంభమైంది. 60ఏళ్ల క్రితం నిర్వహించిన ఈయాగాన్ని తిరిగి తొండవరం శ్రీ తొండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. దు వ్వూరి వెంకట సూర్య ప్రకాశయజ్వ -కనకదుర్గా దంపతులు యాగ కర్తలుగా వ్యవహరించారు. సర్వపృష్ఠాప్తోర్యామ యాగంలో(మహాగ్నిచయనం) భాగంగా ప్రత్యేక ఆకారాలు కలిగిన వెయ్యి ఇటుకలను ప్రత్యేక మంత్రాలతో అమరుస్తామని, ఇలా పేర్చిన ఇటుకలన్నీ గురుడపక్షి ఆకారాన్ని సంతరించుకుంటాయన్నారు. ఈ యాగాన్ని దువ్వూరి యజ్ఞేశ్వరపౌండరీక యాజులు 60ఏళ్ల క్రితం కపిలేశ్వరపురంలో నిర్వహించారు. అమవాస్యనాడు ఈ యాగాన్ని ప్రారంభించడం ఎంతో శక్తివంతమైందన్నారు. 10రోజులు జరిగే ఈ యాగంలో వివిధ కార్యక్రమాలు, క్రతువులు ఉంటాయని, యాగాన్ని వీక్షిస్తే మంచి జరుగుతుందని వేదపండితులు తెలిపారు.

జీజీహెచ్‌లో రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగం నందు రోడ్డు ప్రమాదాలు, ఇతర గాయాలకు సంబంధించి ఆదివారం రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి కాకినాడ ఆర్ఎంసీ, రాజమహేంద్రవరం జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్, అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజ్‌ల నుంచి సుమారు 100మంది జనరల్ సర్జరీ పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అలాగే కాకినాడ, గుంటూరు, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జయపాల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ సాగర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రాంమోహన్ పాల్గొని వైద్య విద్యార్థులకు నూతన శస్త్రచికిత్సా విధానాలు, నూతన మెళకువలు, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం చర్చా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం మాట్లాడారు. విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవిష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు, డాక్టర్ శైలజ, డాక్టర్ శైలజారాణి ఉన్నారు.


జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ విఠల్

సత్యదేవుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం


దేవదాయ మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వచ్చే నెల 8న జరిగే స్వామి వారి దివ్యకల్యాణానికి విచ్చేయాలని ఆదివారం దేవదాయమంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి ఈవో సుబ్బారావు ఆహ్వానపత్రికను అందజేశారు. కల్యాణోత్సవాలు వచ్చే నెల 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవో మంత్రికి వివరించగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కు ఆహ్వానపత్రికను అందజేయగా.. 2,3రోజుల్లో మిగిలినవారికి అందజేస్తామని దేవస్థానం వర్గాలు తెలిపాయి.

రూ.లక్ష విరాళం

రత్నగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన ఇసరపు మానేశ్వరరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ప్రోటోకాల్ అధికారి శౌంరి మూరికి అందజేయగా ఆయన అభినందించి స్వామి వారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాత

'లోవ'లో గంధామావాస్య వేడుకలు


విశేష పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో గంధామావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమ్మవారికి విశేష పూల అలంకరణ గావించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి రూ.3.05 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ సిలబస్

తిరుమల విద్యాసంస్థల చైర్మన్

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా చైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను వారికి అందించాలని అప్పుడే పరీక్షల్లో ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయగలుగుతారని తెలిపారు. పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి కళాశాల్లో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన అవసరమన్నారు. అనంతరం డైరెక్టర్ నున్న సరోజని దేవి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించే ప్రయత్నం చేయాలన్నారు. పిల్లలు పుస్తకాలతో కంటే మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని వివరించారు. సదస్సుకు 15వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. తిరుమల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల అచ్చిబాబు, ఏఎస్‌వీ సత్యనారాయణ (నాని మాస్టర్) పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

సిఫార్సు లెటర్స్ రద్దు వార్తలు అవాస్తవం

టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల

జగ్గంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ దర్శనానికి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సు లెటర్స్ మే 1 నుంచి జూన్ 30 వరకు రద్దు అని వస్తున్న వార్తలు అవాస్తవం అని టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ పాలకమండలి బోర్డు సిఫార్సు లెటర్స్ రద్దుపై ఎటువంటి తీర్మానం చేయలేదన్నారు. సిఫార్సు లెటర్స్ యధాతథంగా కొనసాగుతాయని నెహ్రూ పేర్కొన్నారు.

ఇంటిపై నుంచి జారి పడి బీహార్ కార్మికుడి మృతి

గొల్లప్రోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన బీహార్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. బీహార్ రాష్ట్రంలోని వెస్ట్ చంపారన్ జిల్లా రామ్‌నగర్ తాలూకా నౌరంగియా గ్రామానికి చెందిన 15మంది కార్మికులు సీజనల్ పనులు నిమిత్తం గొల్లప్రోలుకు వచ్చారు. నెలరోజులుగా పట్టణంలోని పిండి ధనరాజు వద్ద ధాన్యం ఆరబెట్టే పనుల్లో కుదిరారు. వారు ఉండేందుకు పట్టణంలో ఒక ఇంటిని సమకూర్చారు. ఈనెల 25న అర్ధరాత్రి 2గంటల సమయంలో ఘణశ్యాం మహతో(44) ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత పిఠాపురం, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. వారి మేస్త్రీ సునీల్ మహతో ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

కోరుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు 2 పేకాట శిబిరాలపై జరిపిన దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చింపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5600 నగదు సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కోటికేశవరం గ్రామశివారులో దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4640 నగదును, 9 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కంచి విశ్వవిద్యాలయంలో 20 మందికి ప్రవేశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయంలో కాకినాడ చుట్టుపక్కల నుంచి సుమారు 20 మంది ప్రవేశం పొందినట్టుగా విద్యాలయ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక ప్రతాప్‌నగర్ చల్లా వారి కల్యాణ మండపంలో వేద స్మార్త పండితులు ఆకెళ్ళ మురళీకృష్ణ, చల్ల నిరంజన్ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 100 మంది విద్యార్థులు హాజరుకాగా 20మంది గ్రాడ్యుయేటు, పోస్ట్ గ్రాడ్యుయేటు కోర్సులు స్వీకరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. భవిష్యత్తులో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



అక్రమంగా డంప్ చేసిన ఇసుక, కంకర, మట్టి నిల్వలు

ఇసుక అక్రమ నిల్వలు

● పట్టించుకోని అధికారులు..!

కరప, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కరప మండలం పాతర్లగడ్డ రహదారిలో కొంతమంది ఇసుకను అక్రమంగా నిల్వచేసి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. ప్రధాన రహదారిని చేర్చి కొన్ని స్టాక్ పాయింట్లను ఏర్పాటుచేసుకున్న వ్యాపారులు కోటిపల్లి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి ఇసుకను తెచ్చి భారీగా డంప్ చేస్తున్నారు. డిమాండ్ ఉన్న సమయాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ములు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం వీరికి వరంగా మారింది. ప్రభుత్వ నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని ర్యాంపుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుకతో పాటు గృహనిర్మాణాలకు అవసరమైన మట్టి, కంకరను పెద్దఎత్తున నిల్వచేసి యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమార్కులకు కొమ్ముకాసేలా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

తహశీల్దార్ వివరణ

దీనిపై కరప మండల తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణను వివరణ కోరగా ఇసుకను అక్రమంగా డంప్‌చేసి విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిపై మైనింగ్ అధికారులతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

వ్యాధులను ముందుగా గుర్తించేందుకు క్వాంటమ్ సెన్సార్లు

● జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

● ముగిసిన క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వ్యాధులను ముందుగా గుర్తించడానికి క్వాంటమ్ సెన్సార్లు, మెరుగైన రోగనిర్ధారణ కోసం క్వాంటమ్ ఇమేజింగ్ పద్ధతులు, కమ్యూనికేషన్, నేవిగేషన్ అప్లికేషన్ల అభివృద్ధి, ఔషధ ఆవిష్కరణ, బ్యాంకింగ్ భద్రతకు ఉపకరిస్తాయని కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో యూసీఈకే సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో క్యూఈటీసీఐ, ఎన్‌క్యూఎంల సంయుక్త సహకారంతో జేఎన్టీయూకే అనుబంధ కళాశాలలు, వివిధ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు రెండురోజుల పాటూ క్వాంటమ్ సైన్స్ టెక్నాలజీ అనే అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సు ఆదివారం సాయంత్రం ముగిసింది. వర్సిటీ ఐక్యూఏసీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, యూసీఈకే సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ ఎల్.సుమలత అధ్యక్షత వహించిన ముగింపు కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.వీసీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికకాలంలో క్వాంటమ్ సైన్స్ టెక్నాలజీ రంగం అద్భుతమైన పురోగతిని సాధిస్తుందన్నారు. జేఎన్టీయూకే పరిసర ప్రాంతాల్లో అనేక చమురు కంపెనీలు, ఆక్వాకల్చర్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అధికంగా ఉన్నందున వాటిని అనుసంధానిస్తూ క్వాంట మ్ టెక్నాలజీని ప్రతీఒక్కరికీ అందుబాటులోకి తీసుకువస్తే కాకినాడ నగరం లైట్‌హౌస్ వలే వెలుగొందుతుందని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి క్వాంటమ్ టెక్నాలజీలో జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల విద్యార్థులకు మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందించడంతో పాటూ పీజీ డిప్లొమా, ఎంటెక్ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించనున్నామన్నారు. అధ్యాపకులు క్వాంటమ్ టెక్నాలజీపై మరింత అవగాహన పెంపొందించుకునేలా ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సదస్సుకు హాజరైన అధ్యాపకులకు వీసీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు శంతనుశర్మ, అనిర్బన్ ముఖర్జీ, సంతోష్‌కుమార్, క్యూఈటీసీఐ సీఈవో రీనాదయాల్ పలువురు డైరెక్టర్లు, మాజీ వీసీలు, సీనియర్ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, జేఎన్టీయూకే అనుబంధకళాశాలలు, పలురాష్ట్రాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అమ్మవార్లను దర్శించుకున్న రామకృష్ణారెడ్డి

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం పెదపూడిలోని శ్రీబల్లాలమ్మ అమ్మవారు., రామేశ్వరంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ఏపీ త్రయంలోని శ్రీ పల్లాలమ్మ అమ్మవారు, పెద్దాడలోని శ్రీ వనుములమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు సందర్భంగా ఆదివారం అమ్మవార్లను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెదపూడి మండలం ఎన్డీఏ నాయకులు, రామేశ్వరం గ్రామం, ఏపీ త్రయం గ్రామం, పెద్దాడ గ్రామం ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేగుళ్లమ్మ జాతర



వేగుళ్లమ్మ తల్లి

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామదేవతగా విరాజిల్లుతున్న వేగుళ్లమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఆదివారం, అమావస్య కలిసి రావడంతో అమ్మవారికి రజత కవచ అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. జాతర మహోత్సవాన్ని డీసీసీబీ సీఈవో దాట్ల వెంకట సుబ్రహ్మణ్య వర్మ ప్రారంభించగా, ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు నిర్వహించారు.

వైభవంగా కోట సత్తెమ్మతల్లి జాతర



కోట సత్తెమ్మ తల్లి

పిఠాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కొండప్ప వీధిలోఉన్న కోట సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారిని పుష్పమాలలతో అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి నగరోత్సవం జరిగింది. గరగనృత్యాలు, ఇతర ప్రదర్శనలతో అమ్మవారిని పల్లకిపై ఊరేగించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల జాతర



వాకతిప్పలో ఆదిలక్ష్మీతల్లి సిరిమాను ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామదేవత ఆదిలక్ష్మి అమ్మవారు, కొండెవరంలో పెద్దింట్లమ్మ జాతరలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల ఆలయ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గ్రామదేవతలుగా భావించే సిరిమాను (తాడిచెట్టు)ను రెండెడ్ల బండిపై గ్రామాల్లో ఊరేగించారు. సిరితాడుపై గ్రామప్రజలు పసుపుతో కలిపిన నీళ్ళనుపోసి భక్తిని చాటుకున్నారు. సిరిమాను గ్రామాల్లో ప్రధాన వీధుల్లో ఊరేగించిన అనంతరం అమ్మవారి ఆలయాలవద్ద ఏర్పాటుచేసిన సిరితాడు తిప్పారు. అనంతరం వాకతిప్ప, కొండెవరం పరిసర ప్రాంతాల ప్రజలు ఆదిలక్ష్మి, పెద్దింటమ్మ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు అమ్మవార్ల దర్శనం చేసుకున్న భక్తులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

● జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు లక్ష్మణమూర్తి



ఉగ్రవాదుల దాడిలో అశువుల బాసిన వారికి ఎంపీ క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పిలుపు మేరకు స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈ దాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతుల స్మృతిలో 26 మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు కర్రి సత్యనారాయణరాజు మాట్లాడుతూ టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, బొళ్ల కృష్ణమోహన్, చింతపల్లి అర్జున్, చక్రధరరావు, నాగిరెడ్డి బుజ్జి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



వివిధ టోర్నీల్లో సాధించిన పతకాలు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

పిఠాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మే 31వ తేదీ వరకూ ప్రతిరోజూ ఉదయం 6గంటలు నుంచి 8గంటల వరకూ ఆర్చరీ, బాక్సింగ్, తైక్వాండో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం ప్రారంభించారు. ఏడాది కాలంగా వివిధ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. క్రీడా కోటాలో రిజర్వేషన్‌ను 2 నుంచి 3శాతానికి పెంచారని చెప్పారు. కోచ్ పి.లక్ష్మణరావు ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, కౌన్సిలర్ రాయుడు శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె.చిన్నబ్బాయి, పి.వేణు, జి.శివప్రసాద్. బి.వంశీ, సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

● కేసు నమోదు

సామర్లకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్రౌన్‌పేటకు చెందిన పిట్టా రాజేష్ అనే యువకుడిని అదే ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు దాడిచేసి గాయపరిచారన్న అవమానం భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాప్రాయస్థితిలో చికిత్స పొందుతున్న ఒక యువకుడి సంఘటనపై సామర్లకోట పోలీస్టేషన్లో కేసు నమోదైంది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై ఆదివారం సామర్లకోట పోలీసులు అందించిన సమాచారం మేరకు బ్రౌన్‌పేట పార్కువద్ద మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో సదరు బాధితుడికి, నలుగురు యువకులకు మధ్య వాగ్వివాదం ఇరువురి మధ్య ఘర్షణలకు దారి తీసింది. నలుగురి చేతిలో గాయపడిన యువకుడు అవమానం భరించలేక గడ్డి మందును కూల్‌డ్రింకులో కలుపుకుని తాగడంతో అపస్మారకస్థితికి చేరగా కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వాంగ్మూలం మేరకు దాడిచేసిన నలుగురు యువకులపై కేసు నమోదుచేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భీమేశ్వరాలయంలో ఎస్పీ దంపతుల పూజలు



పండితులచే వేదాశీర్వచనం పొందుతున్న ఎస్పీ దంపతులు

సామర్లకోట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయాన్ని ఆదివారంరాత్రి జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సతీసమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించి భీమేశ్వరుడికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో అన్ని ఉపాలయాలను దర్శించి దేవతామూర్తులకు పూజలు చేశారు. అనంతరం భీమేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నంది మండపంవద్ద పండితులచే వేదాశీర్వచనంతో స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన వజ్రోత్సవ వేడుకలు



విద్య, క్రీడా రంగాల్లో రాణిస్తున్న పాఠశాల విద్యార్థులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కరప, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడు శ్రీ బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. హైస్కూల్ ఏర్పడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా డైమండ్ జూబ్లీ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. చివరిరోజు వేడుకలకు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, తదితరులు హాజరై ప్రసంగించారు. విద్యాభివృద్ధికి బిరుదా సూర్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు. పూర్వపు ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విద్య, క్రీడారంగంలో మంచి ప్రతిభ కనబరుస్తున్న పలువురు విద్యార్థులను సన్మానించారు. ఆయా రంగాల్లో ఉన్నతస్థాయికి చేరిన పలువురు పూర్వపు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొండా సూర్యనారాయణ, ఐరెడ్డి సత్యనారాయణ, చిక్కం రామచంద్రరావు, యర్రంశెట్టి సత్యనారాయణ, బిరుదా బాబు, దేవు సదానందమూర్తి, యాళ్ల కృష్ణారావు, నల్లా సత్యనారాయణమూర్తి, లక్ష్మణరావు, కె.నరసింహమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



దివిలి కిట్స్ కాలేజీలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో 2015లో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు తాము చదువుకున్న కళాశాలలో తీపి గుర్తులు నెమరువేసుకుని సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఫోటోలు తీసుకుని సందడి చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి 33/ 11కేవి సబ్‌స్టేషన్ పరిధిలోగల కొండెవరం 11కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈనెల 29న మంగళవారం ఈ క్రింది గ్రామాలకు విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. కొండెవరం, కొత్త, పాత ఇసుకపల్లి, శొంఠివారి పాకలు, కామన్నగారి పాకలు, జొన్నలగరువు, పెంకేవారిపాలెం, తోటూరు గ్రామాలకు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విని యోగదారులు సహకరించాలని ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఖాతాదారులకు అందుబాటులోకి మరిన్ని సేవలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తేనున్నామని కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టౌన్ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్‌కు సంబంధించి లావాదేవీలకు ఖాతాదారులకు చైర్మన్ రవీంద్ర వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.1110.40 కోట్లు డిపాజిట్లు, రూ.750.16కోట్లు రుణాలు ఉన్నాయన్నారు. ఈ గడువు నాటికి రూ.15.53కోట్ల నికర లాభం ఆర్జిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న కోపరేటివ్ బ్యాంకులలో 46 శాఖలతో టౌన్‌బ్యాంక్ రెండో స్థానంలో ఉందన్నారు. ఖాతాదారులు ఫోన్ నంబర్, ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, కంటిపూడి సత్య నారాయణ, సీఈవో సుగుణారావు పాల్గొన్నారు.

ముదురుతున్న ఎండలు

సామర్లకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గత నాలుగు రోజులుగా ఎండలు ముదురుతున్నాయి. అత్యవసర పనులుంటే తప్ప ఇళ్ళ నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. రాత్రిపూట చల్లటి గాలులు, తెల్లారిందంటే భానుడు భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం 12గంటలు అయ్యిందంటే చాలు భానుడు ఉగ్రరూపం దాల్చు తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండదెబ్బకు మధ్యాహ్నం రోడ్లపై జనం సందడి తగ్గి ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతూ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. ఆదివారం అత్యధికంగా 34.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

పిఠాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహణలోని పిఠాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభిస్తున్నామని గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము తెలిపారు. ఈ శిబిరంలో డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, దేశభక్తి గేయాలు, పేపర్ ఆర్ట్స్, కథలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 8నుంచి 11గంటల వరకూ ఈ శిబిరం జరుగుతుందని తెలిపారు. పిఠాపురం, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కరప: వేళంగి శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకట రంగయ్య తెలిపారు. దీనిలో భాగంగా కథలు వినడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

సామర్లకోట: సామర్లకోట గ్రంథాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 28 నుంచి జూన్ 6 వరకూ వేసవి శిక్షణాతరగతులు నిర్వహించనున్నందున పట్టణ పరిధిలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట గ్రంథాలయం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కథలు చెప్పడం, చిత్రలేఖనం, కథలు చదవడం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం, తదితర అంశాలలో ప్రతీరోజూ శిక్షణలు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ స్నేహిత్‌కు సత్కారం



సివిల్స్ ర్యాంకర్ చక్కా స్నేహిత్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు

పిఠాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన చక్కా స్నేహిత్ పిఠాపురం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్నేహిత్‌ను ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దంగేటి సత్యనారాయణమూర్తి, కంచర్ల నగేష్‌గుప్తా, పైడా శ్రీనివాసరావు, వెలగా వెంకటనగేష్, కేదారశెట్టి విశ్వేశ్వరరావు, రేపాక రామచంద్రరావు, రమేష్, బాదం ఈశ్వరబాబు, చక్కా వీరబాబు, సమయపంతుల శివ పాల్గొన్నారు.

పేదలకు ఉపకరణాల అందజేత



ఎమ్మెల్యేలు వనమాడి, నానాజీ చేతులమీదుగా ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

కాకినాడరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ వజ్రోత్సవాల సందర్భంగా సూర్యకళా మందిరంలో ఆదివారం లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, కమిటీ చైర్మన్ డేగల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పేదలకు రూ.8 లక్షల విలువైన 46 కుట్టుమిషన్లు, 7 వెట్ గ్రైండర్లు, ఒక ఇస్త్రీ బండి, 2కృత్రిమ కాళ్లు, 2సైకిళ్లు, వీధి వ్యాపారస్థులకు 100 గొడుగులు, ఇతర ఉపకరణాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ సేవకు మారుపేరైన లయన్స్ క్లబ్ ఇతర క్లబ్‌లతో కలిసి ఇంత పెద్దఎత్తున సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లద్వారా సమాజంలోని ఎంతోమంది పేదలకు లబ్ధిచేకూరడంతో పాటూ స్వయం ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. లయన్ విజయకుమార్ రాజు, లయన్స్ జిల్లా గవర్నర్ ఈశ్వరకుమార్, కాకినాడ వ్యవసాయమార్కెటింగ్ కమిటీ చైర్మన్ బచ్చుశేఖర్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఉమా మహేశ్వరరావు, మోహన్‌కుమార్, రామసుబ్రహ్మణ్యం, కుమార్, మురళీ పాల్గొన్నారు.

కోడిపందాలపై దాడి

● ఆరుగురి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రెండు కోళ్లు, రూ.4,300నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మురారి దుర్గమ్మతోటకు పోటెత్తిన భక్తులు



గండేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మురారి తోటలో వెలసిన దుర్గమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మేడేను పండుగలా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికులంతా మేడేను పండుగలా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు ఆదివారం తెలిపారు. రాజవొమ్మంగి లో సీఐటీయూ నాయకురాలు కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

సీఐటీ యూ జిల్లా నేత రామరాజు మాట్లాడుతూ అంగన్ వాడీలకు వేతనాలు పెంచకుండా పనిభారం పెంచుతున్నారని ఆరోపించారు. ఎనిమిది గంటల పనిదినం, కార్మికుల హక్కులపై సైద్ధాంతిక దాడి జరుగుతోందన్నారు. పెండింగ్ క్లైమ్ నేటికీ అందలేదని తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సెలవులకు ఊరెళుతున్నారా... అయితే జర భద్రం

మోతుగూడెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను పురస్కరించుకుని ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. రాత్రివేళల్లో వీధుల్లో గస్తీని ము మ్మరం చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సమీప పోలీస్‌స్టేషన్ లోని అధికారులకు తెలపాలన్నారు. వారి వివరాలను నమోదు చేసుకుని వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామ న్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవడం శ్రేయస్కరమన్నారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100కు లేదా 112కి ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

పాపికొండలకు ఐదు బోట్లు

దేవీపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పాపికొండలు విహారయాత్రకు ఆదివారం ఐదు బోట్లలో సుమారు 320 మంది పర్యాటకులు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని ముంపు గ్రామాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాల పల్లి వెళ్లి సందడి చేశారు.

అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే గోదావరిలో స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి సంబంధించి టిక్కెట్టు తదితర వాటి ద్వారా రూ.26వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న దేవీపట్నం ఎస్‌ఐ

దేవీపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

వై.రామవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వై.రామవరం శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి జె.సత్యవతి తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థినీ విద్యార్థులకు కథలు చెప్పడం, రాయడం, క్విజ్ పోటీలు, పేపర్ క్రాఫ్ట్, చిత్రలేఖనం, నృత్యం, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతకు డీఎస్సీ పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యుదాఘాతంతో గిరిజన యువకుడి మృతి



విద్యుదాఘాతంతో మృతిచెందిన శివప్రసాద్ (ఫైల్)

రాజవొమ్మంగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వీధిలైట్లు వెలగకపోవడంతో గిరిజన యువకుడు కరెంటు స్తంభం ఎక్కి హైటెన్షన్ వైర్ తగిలి విద్యుదాఘాతంతో ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. మండలంలోని లోదొడ్డి పంచాయతీ పాకవెల్తి గ్రామానికి చెందిన పప్పుల శివప్రసాద్(18) అనే గిరిజన యువకుడు గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ వద్ద వీధిలైట్ వెలగకపోవడంతో తరచూ కర్రలతో కొడుతూ వెలిగించేవారు. శనివారం సాయంత్రం లైటు వెలగకపోవడంతో శివప్రసాద్ విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు కదుపుతుండగా హై టెన్షన్ విద్యుత్ వైరు తగిలి షాక్ గురై ఒక్కసారిగా స్తంభం నుంచి నేలపై కుప్పకూలి తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ లోతా రామారావు స్థానికులు 108 సహాయంతో ఏలేశ్వరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా శివప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై శివప్రసాద్ తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

క్రికెట్ స్టేడియానికి స్థల పరిశీలన

జగ్గంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం రోడ్డులో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు అనువైన స్థలం కోసం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలన చేశారు. గోకవరం రోడ్డులోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజ్, ఇండోర్ స్టేడియం, కాపు కల్యాణ మండపం దగ్గర ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, మండపాక అప్పన్నదొర, కోడూరి రమేష్, ఆకుల వంశీ, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్



నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం, ప్రత్తిపాడు, ధర్మవరం శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు కవికొండ సత్యనారాయణ, ఈ.సన్యాసి తెలిపారు. తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు చదవడం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ వంటి అంశాలపైశిక్షణ ఉంటుందని, విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8నుంచి 12గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతాయని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించే విధంగా ప్రోత్సహించాలని గ్రంథాలయాధికారులు సూచించారు.

గంగాలమ్మ, గుబ్బాలమ్మ తీర్థం



రాచపల్లిలో గుబ్బాలమ్మ అమ్మవారికి భక్తుల పూజలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం, రాచపల్లి గ్రామాల దేవతలు గంగాలమ్మ, గుబ్బాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపల్లిలో నిర్వహించిన విశాఖ ఎన్‌వీ రైడర్ డీజే ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఆలయాన్ని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవానికి విరాళం అందజేశారు. ధర్మవరం గంగాలమ్మ ఆలయాన్ని కూడా మురళీరాజు సందర్శించి పూజలు నిర్వహించారు.

కనకదుర్గ ఆలయంలో ముగిసిన చైత్రమాసోత్సవాలు

అన్నవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి తొలిపావంచా వద్ద కొలువుదీరిన కనకదుర్గ ఆలయంలో చైత్రమాసోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారంరోజులుగా ఆలయంలో జపములు, పారాయణలు, లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు చండీహోమం ప్రారంభించి 11 గంటలకు పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విభాగ ఏఈవో కొండలరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేసి అన్నశాంతి జరిపారు.

గండేపల్లి ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

గండేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తొమ్మిది మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో చైర్మన్‌గా గుర్రాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముకూరి శ్రీను ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. వారిని ఎమ్మెల్యే నెహ్రూ సత్కరించారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, యలమాటి కాశీ తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కత్తిపూడిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

శంఖవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు పదుల తరవాత విద్యార్థులందరూ ఆత్మీయంగా కలిసారు. కత్తిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యాసంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. తాము చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, స్నేహితులతో కలిసి ఆడిన ఆటలు, చిన్న చిన్న గ్యాంగులు వంటివన్నీ గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి పేర్లతో ఒకరినొకరు ఆటపట్టించుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవించి సన్మానించారు. రోజంతా ఆనందంగా గడిపారు.

ప్రత్తిపాడు: ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అదే పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి విద్యాభ్యాస అనుభవాలు, కలిసిమెలిసి పాఠశాలకు వచ్చిన సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులైన ప్రస్తుతం గొల్లప్రోలు, కిర్లంపూడి ఎంఈవోలుగా పనిచేస్తున్న బొట్టేటి శివప్రసాద్, చిన్నారావులతోపాటు పర్వత వెంకట్రావు, రాణి, ఫణికుమార్, సుబ్బారావు, నాగవేణి, రంగనాయకులు, రాజారావు, సత్యనారాయణ, శ్రీవల్లి, సుబ్బారావు, భాష్యం, గణేష్, దుర్గాప్రసాద్, పీఈటీ శ్రీనులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలను, కన్నతల్లి లాంటి ఉన్న ఊరును మర్చిపోరాదని, వాటి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.



ధర్మవరంలో పూర్వ విద్యార్థుల సమావేశం దృశ్యం

మత్స్యకారుల సంక్షేమం కోరే మహానేత చంద్రబాబు



పాలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

తొండంగి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోరే మహానేత చంద్రబాబు అని, ఆయన ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ భృతి రూ.20వేలు ఇవ్వడం మత్స్యకారులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని జిల్లా టీడీపీ మత్స్యకార అధ్యక్షుడు కోడవెంకట రమ ణ అన్నారు. ఆదివారం ఒంటిమామిడి సెంటర్‌లో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ సమక్షంలో మండల మత్స్యకార నేతలు చంద్రబాబు, ఎమ్మెల్యే దివ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మత్స్యకారులకు రూ.5కోట్ల 52 లక్షల నిధులు విడుదల చేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. ఎమ్మెల్యే దివ్య తమ పక్షాన అసెంబ్లీలో తన వాణి వినిపించి మేలు చేశారన్నారు. సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చొక్కా కాశీ, చొక్కా అప్పారావు, చొక్కా బుల్లబ్బాయి, గంటా లక్ష్మణ్, కోడ అప్పల రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో పండుగ శోభ



కుమ్మరిలోవలో అమ్మవారిని దర్శించుకుంటున్న యనమల రాజేష్

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గంధామావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామదేవత తలుపులమ్మ తల్లి జాతర వేడుకలు గ్రామాల్లో కన్నుల పండుగగా జరిగింది. వి.కొత్తూరులో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తుని రూరల్ తాళ్ళూరు, రాజుపేట, కుమ్మరిలోవ, కొలిమేరు, లోవకొత్తూరు, తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వెలమకొత్తూరు, కుమ్మరిలోవ గ్రామాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

మాలల మహారణభేరి కరపత్రం ఆవిష్కరణ



కిర్లంపూడిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకులు పివిరావు జయంతి సందర్భంగా కాకినాడలో మే 12న రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు పండు అశోక్‌కుమార్ అధ్యక్షతన మాలల మహారణభేరి జరగనుంది. ఆదివారం కిర్లంపూడిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల మహారణభేరి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు పండు అశోక్ కుమార్, లింగ శివకుమార్, బుంగ సతీష్ కుమార్, మర్రి చిట్టిబాబు, బులుపే గోపి, తదితరులు పాల్గొన్నారు.

మేడే కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని కట్టుబానిసత్వానికి గురిచేసేవిధంగా ఆర్ఎస్ఎస్ బీజేపీ సర్కార్ 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చే విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం 139వ మేడేను జరపాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. జగ్గంపేట మండలం రామవరం శివారు రంగవల్లి నగర్‌లో 139వ మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్, డాన్ శ్రీను, దేవి, తిరుపతమ్మ, అర్జున్ పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఏలేశ్వరంలో కాగడాలతో ప్రదర్శన చేస్తున్న వ్యాపారస్థుల సంక్షేమ సంఘ సభ్యులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రదాడిని ప్రతీ భారతీయుడు ఖండించాలని, అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ చిన్న వ్యాపారస్తుల సంఘం నేతృత్వంలో ఆదివారం రాత్రి కాగడాల ప్రదర్శన చేట్టారు. మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీ చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అహింస, శాంతి ఐక్యత, అనేవి మన దేశ మూలాలని, ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో నురెన్ ఖాన్, అలమండ నాగేంద్ర, బంక రాజు, పరవాడ రమేష్, జేడీ ధనబాబు, బట్ట మల్లిబాబు, శిడగం శ్రీనివాస్, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి



రాచపల్లిలో పర్యటిస్తున్న వైసీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ప్రజల్లో పార్టీ పట్ల ఆదరణ ఉందని, దానిని నిలబెట్టేందుకు ఇప్పటి నుంచే శ్రేణులు శ్రమించాలన్నారు. అనంతరం గ్రామదేవత గుబ్బాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వైసీపీ మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను(బంకు శ్రీను), సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, ఒమ్మి రమణ, జక్కా త్రిమూర్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ అమావాస్య వేడుకలు



కాకరాపల్లిలో గంధ అమావాస్య పూజలు నిర్వహించిన దృశ్యం

కోటనందూరు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి):మండలంలో గంధ అమావాస్య వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి కాకరాపల్లి, కెకొట్టాం, ఎస్ఆర్‌పేటలోని మరిడిమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించారు. జగన్నాథపురం గ్రామ శివారులో చల్లాలమ్మతల్లి ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేపట్టారు. అలాగే మిగతా గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు. పలుసాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

తాగునీటికి కటకట



ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన తుప్పలు

● అధ్వానంగా వాటర్ ట్యాంక్‌లు.

● పనిచేయని చేతి పంపులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):పట్టణంలో తాగడానికి మంచినీరు కూడా లేక పలు వార్డుల్లో ప్రజానీకం పడుతున్న అవస్థలను చూసైనా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలేదు. ఎన్నో ఏళ్ల నుంచి నగర పంచాయతీ పరిధిలో అప్పన్నపాలెం ప్రజలకు సుద్దనీటినే తాగుతున్నారు. ఏ ప్రాంతంలో బోర్లు వేసినా సుద్దనీరే రావడంతో తాగేందుకు మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈప్రాంతవాసులకు తాగునీరు అందించేందుకు జీఎల్ఆర్ ట్యాంకును నిర్మించారు. దీని నుంచి సుద్దనీరే రావడంతో ఈనీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. సాయిబాబా మెట్ట మీద ఉన్న వాటర్ ట్యాంకు నాచు పేరుకుపోవడంతో పైపుల నుంచి కుళాయిల ద్వారా నీటితోపాటు నాచు వస్తుండడంతో ప్రజలు తాగునీటికి పాట్లుపడుతున్నారు. చుట్టూ పిచ్చి తుప్పలు మొలవడంతో దాని చుట్టూ ఉన్న పైపులు దెబ్బతిన్నాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంకు శిథిలావ్యవస్థకు చేరడంతో ట్యాంకుపై మొక్కలు మొలవడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారులు వాటర్ ట్యాంకులు శుభ్ర పరచడం కానీ తుప్పలను తొలగించడంపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ట్యాంకులను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

కాలువలో చలమలు నీరు.

తాగునీటి కోసం సమీప ఏలేరు కాలువలోని చలమలపై ఆధారపడుతున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్నా ఏలేరు కాలువలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

గాలికొదిలేసిన చేతి పంపులు

వేసవిలో అత్యవసర పరిస్థితుల్లో తాగునీటి సరఫరా చేసే చేతిపంపుల నిర్వహణను నగర పంచాయతీ అధికారులు గాలికొదిలేశారు. కనీసం మరమ్మతుల నిమిత్తం చిల్లి గవ్వకూడా ఖర్చు పెట్టకపోవడంతో తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. పట్టణంలో సుమారు 180కి పైగా చేతి పంపులు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులు చేసేందుకు పనికిరాకుండా ఉన్నాయి. కుళాయిలు రాని సమయంలో చేతిపంపులే ఆధారంగా నిలిచేవి. వార్డుల్లో చేతి పంపులు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ లేకపోవడంతో మూలకు చేరాయి. దీంతో వేసవిలో ప్రజలకు తాగునీటి వెతలు తప్పడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలకు చేరిన చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పట్టణంలో పనిచేయని చేతిపంపు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజల నంతరం పండితుల మంత్రోచ్చరణలు, బాజాభజంత్రీలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.